క్రీడలతో శారీరక దారుఢ్యం





గుత్తిలో క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు, బీకేఎస్‌లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు, శింగనమల మండలం తరిమెలలో వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

తాడిపత్రి, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాల్లో బుధవారం ఆడుదాం ఆంధ్రా పోటీలు జోరుగా సాగాయి. ఉన్నత పాఠశాలల్లోని మైదానాల్లో అధికారులు కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ తదితర పోటీలు నిర్వహించారు. ఆయా విభాగాల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. స్థానికులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి పోటీలను తిలకించారు.

యాడికి: క్రీడలతో శారీరక, మానసిక దారుఢ్యం లభిస్తుందని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ అన్నారు. రెండో రోజు ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా బుధవారం మోడల్ స్కూల్ వద్ద క్రికెట్ క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీఓ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీలు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ ఫుట్ బాల్ క్రీడామైదానంలో రెండో రోజు బుధవారం కూడా ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు జరిగాయి. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు క్రికెట్ మ్యాచ్‌లను ప్రారంభించారు. అంతకు ముందు క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేశారు.

పెద్దపప్పూరు: మండల కేంద్రంతో పాటు అమ్మలదిన్నె, జూటూరు, నరసాపురం, గార్లదిన్నె, పెద్ద ఎక్కలూరు, చీమలవాగుపల్లి, ముచ్చుకోట తదితర గ్రామాల్లోని జెడ్పీ ఉన్నతపాఠశాలల క్రీడా మైదానాల్లో బుధవారం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ , ఖోఖో పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎంపీడీఓ రామకృష్ణ, పీడీలు, పీటీఈలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శింగనమల: శింగనమల, తరిమెల, పెరవలి, సలకంచెర్వు, సోదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని క్రీడా మైదానాల్లో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జోరుగా సాగాయి. శింగనమలలో క్రికెట్, కబడ్డీ, పెరవలిలో క్రికెట్, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. పోటీలను ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఎంఈఓ–2 శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, పీడీ, పీఈటీలు పర్యవేక్షించారు.

బుక్కరాయసముద్రం: స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో బుధవారం ఆడుదాం ఆంధ్రాలో భాగంగా కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ భాస్కర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేలా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. స్పెషలాఫీసర్ శ్రీదేవి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ తేజోత్స్న, సర్పంచ్ పార్వతి, ఎంపీటీసీ కాలువ వెంకటలక్ష్మి, ఎంఈఓ లింగా నాయక్, హెచ్‌ఎం వసుంధర, క్రీడా కారులు పాల్గొన్నారు.

పామిడి: మండలవ్యాప్తంగా గల క్రీడాకారులు ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం గెలుపొందిన క్రికెట్ జట్లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పీడీ నరేష్, సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీఓ విజయ భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం రెండవ రోజు మండల వ్యాప్తంగా 16 గ్రామ సచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించడానికి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రనాయక్ ,ఈఓఆర్డీ వెంకటలక్ష్మి ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ జి.రవి అన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. బుధవారం ఆడుదాం ఆంధ్రాలో భాగంగా పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, షటిల్, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీడాకారులను దేశానికి అందించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు.

పెద్దవడుగూరు : మండలవ్యాప్తంగా బుధవారం రెండో రోజు ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొత్తం 28 జట్లు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్నట్లు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఎంఈఓ రాముడు తెలిపారు.

ప్యాక్ హౌస్‌లు సద్వినియోగం చేసుకోండి



గోవిందరాయునిపేటలో ప్యాక్‌హౌస్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి రఘునాథరెడ్డి

శింగనమల: పండ్ల తోటల రైతులు సమగ్ర ఉద్యాన పథకం కింద ప్యాక్‌హౌస్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి రఘునాథరెడ్డి సూచించారు. గోవిందరాయునిపేట గ్రామంలో రైతు శివశంకర్‌రెడ్డి నిర్మించిన ప్యాక్‌హౌస్‌ను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం రాయితీపై పలు పథకాలను అందిస్తోందన్నారు. అనంతరం రైతు సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలించారు. పంటలో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయ సంచాలకుడు నరసింహారావు, మండల ఉద్యాన అధికారి శైలజ, రైతు భరోసా కేంద్రం సిబ్బంది రాజారెడ్డి, ఉమాదేవి పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం కల్పిస్తోందని జిల్లా ఉద్యానశాఖ అధికారి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం రోటరీపురం, జంతలూరు, కొట్టాలపల్లిలో రైతులు సాగు చేసిన ఉద్యాన పంటలను పరిశీలించారు. ముందుగా మండలంలో ఎంత మంది రైతులున్నారు, ఎన్ని ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారని మండల ఉద్యాన శాఖ అధికారి శైలజను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుపై రాయితీలు కల్పిస్తోందన్నారు. అనంతరం రైతులు సాగు చేసిన అరటి, దానిమ్మ, ద్రాక్ష పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల వాటి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ సహాయ సంచాలకుడు నరసింహారావు, రైతు భరోసా అధికారి నేత్రా, జగన్, రైతులు పాల్గొన్నారు.

అనవసర రాద్ధాంతం చేయొద్దు

● టీడీపీ కౌన్సిలర్లకు ఆర్డీఓ హితవు



ఆర్డీఓతో వాదనకు దిగిన టీడీపీ కౌన్సిలర్లు

తాడిపత్రిటౌన్: అనవసర రాద్ధాంతం చేసి పట్టణంలో శాంతిభద్రతల సమస్య సృష్టించొద్దని టీడీపీ కౌన్సిలర్లకు ఆర్డీఓ గ్రంధి వెంకటేష్ హితబోధ చేశారు. పట్టణంలోని విద్యుత్ స్తంభాలకున్న వైఎస్సార్‌సీపీ జెండాలో పర్యావరణానికి హాని కలుగుతోందని, వాటిని తొలగించాలని కోరుతూ కౌన్సిలర్లు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు వెంటనే జెండాలు తొలగించాలని ఆర్డీఓతో వాదనకు దిగారు. వారి వాదన విన్న ఆయన సున్నితంగా తిరస్కరించారు. ప్రజలకు ఇబ్బందులు లేనప్పుడు మీరెందుకు రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఏదైనా సమస్య ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలి గానీ ఇలా చేయడం ఏంటని కౌన్సిలర్లను ఆయన ప్రశ్నించారు. ఆర్డీఓ ఎంత చెప్పినా కౌన్సలర్లు వినకుండా రాద్ధాంతం చేస్తూ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. టీడీపీ కౌన్సిలర్లకు పనిలేక ఇలా మతిలేని చేష్టలు చేస్తున్నారని కార్యాలయానికి వచ్చిన ప్రజలు చర్చించుకోవడం కనిపించింది.

కుష్టు రహిత సమాజం నిర్మిద్దాం



గార్లదిన్నెలో కుష్టు నివారణపై ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

గుత్తి రూరల్: కుష్టు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, డీపీఎంఓ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం బేతాపల్లి గ్రామంలో జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య సిబ్బందితో బేతాపల్లి పీహెచ్‌సీ నుంచి కుష్టు నివారణపై ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జనవరి 12 వరకూ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, చర్మం రాసినట్టు ఉంటే వైద్యాధికారులను సంప్రదించాలని అన్నారు. వైద్య సిబ్బంది జఫ్రుల్లా, ఆంజనేయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటించి కుష్టుపై అవగాహన కల్పించాలని ప్రాథమి ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ మంజుల, సుధ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సర్కిల్ వరకు వైద్యసిబ్బంది కుష్టు నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ కుష్టును సామాజిక సమస్యగా గుర్తించాలన్నారు. గ్రామాల్లో ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి కుష్టు వ్యాధి లక్షణాలు గురించి వివరించాలన్నారు. వ్యాధిని సకాలంలో గుర్తించి ఇతరులకు సోకకుండా వెంటనే చికిత్స అందించాలన్నారు. సీహెచ్‌ఓ లోక్‌నాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కాలనీలో నీటి సమస్య పరిష్కారం

యాడికి: మండల కేంద్రంలోని కోన రోడ్డులో ఉన్న అంబేడ్కర్ కాలనీలో నీటి సమస్య పరిష్కారమైంది. కాలనీలో కొద్ది రోజుల క్రితం తాగునీటి సమస్య ఉత్పన్నమైంది. కాలనీ వాసులు సమస్యను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన వెంటనే కాలనీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి సమస్య తెలియజేశారు. ఆయన ఆదేశాల మేరకు కాలనీలో పంచాయతీ నిధులతో బోరుబావి తవ్వించారు. నీరు పుష్కలంగా లభించడంతో బుధవారం మోటారు బిగించి కాలనీకి నీరు సరఫరా చేశారు. ఈసందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి, బొంబాయి రమేష్ నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాడికి ఉప సర్పంచు కాసా చంద్ర మోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు నాయకుడు శ్రీరాములు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల తనిఖీ

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈఓ శ్రీదేవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు

అవకతవకలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి

గుంతకల్లు: రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆర్డీఓ వాకా శ్రీనివాసులు రెడ్డి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజనల్ కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. సీఎస్‌డీటీలు, ఎఫ్‌పీ షాపు డీలర్లు, ఎండీయూ (మొబల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్) ఆపరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రతి నెలా 1 నుంచి 15 వరకు ఎండీయూ ద్వారా గడప గడపకూ రేషన్ వేయాలన్నారు. ఎండీయూ వాహనాలకు కొత్త జియో ట్యాగింగ్ చేశామన్నారు. రేషన్ వేసే సమయంలో వాహనం వెంట వలంటీర్లు ఉంటారన్నారు. జనవరిలో గోధుమపిండి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పట్టణాల్లో బియ్యం, చెక్కరతోపాటు రాగులు, రూరల్‌లో బియ్యంతోపాటు రాగులు అందిస్తున్నట్లు వివరించారు.

టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు

గుంతకల్లు: నవ్యాంధ్ర టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ పట్టణ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సుబాని, ఉపాధ్యక్షుడు బహదూర్‌ఖాన్ బుధవారం తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా షేక్షావలి, ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి, సలహాదారుడిగా ఎస్‌పి రహిమన్, కార్యదర్శిగా రీగల్ టాకీస్ బాషా, మండల ఇంచార్జ్‌గా అల్తాఫ్, సభ్యులుగా రఫీక్, మల్లీ, యల్లప్ప, దాదాఖలందర్, ఇస్మాయిల్, కిరణ్‌ను ఎన్నుకున్నట్లు వివరించారు.

ముగిసిన దత్తాత్రేయ జయంత్యుత్సవాలు



పామిడిలో దత్తపాదుకల ఊరేగింపు దృశ్యం

పామిడి: పట్టణంలోని మహాయోగ దత్తపీఠంలో 9 రోజులుగా నిర్వహిస్తున్న దత్తాత్రేయ జయంత్యుత్సవాలు బుధవారం ముగిశాయి. ఈసందర్భంగా పీఠాధిపతి సురేంద్ర మహారాజ్ ఆధ్వర్యంలో దత్తాత్రేయుడిని శోభాయమానంగా అలంకరించి హోమాలు, పూజలు చేశారు. దత్తాత్రేయ జనన ఘట్టానికి సూచనగా ఉయ్యాల సేవ నిర్వహించారు. అనంతరం దత్తాత్రేయుని పాదుకలను పల్లకీలో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. దారిపొడవునా భక్తులు దత్తపాదుకలను దర్శించుకొని తరించారు. దత్తపీఠాధిపతి సురేంద్ర మహారాజ్ దత్తాత్రేయ జయంతి ప్రాముఖ్యతను వివరించారు.

మున్సిపల్ అధికారులకు సహకరించాలి

గుత్తి: మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ కార్మికుల సమ్మె నేపథ్యంలో పారిశుధ్య, తాగునీటి సమస్య తలెత్తే అవకాశముందని, ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు కోరారు. ఈమేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇళ్లలోని చెత్తను చెత్త బుట్టల్లో వేసి మున్సిపాలిటీ వాహనాలకు ఇవ్వాలని సూచించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి



శింగనమల: చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి అనంతపురంలో మృతి చెందింది. ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాలు.. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్లుతున్న గుర్తు తెలియని మహిళ(45) అనంతపురం –తాడిపత్రి రోడ్డు పోతురాజుకాల్వ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందింది. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు 9346010588 నంబరులో సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర

అనంతపురం కల్చరల్: రామ జన్మభూమి తీర్థ క్షేత్ర వారి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా వివిధ దేవాలయాలకు చేరుకున్న అయోధ్య రామాలయం అక్షింతలతో కొత్తూరు అమ్మవారి శాల వారు బుధవారం శోభాయాత్ర నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపా మచ్చానరసింహులు మాట్లాడుతూ.. దేశవాసుల ఆకాంక్షలకు అద్దం పడుతూ సాగుతున్న అయోధ్య అక్షింతలు వాసవీ అమ్మవారి శాలకు రావడం ఆనందంగా ఉందన్నారు. అక్షింతలను జనవరి మొదటి వారంలో ఇంటింటికీ వితరణ చేస్తామన్నారు. కొత్తూరు అమ్మవారి శాలకు చేరుకున్న ర్యాలీలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు విజయ్, మహిళా మండలి అధ్యక్షురాలు నిర్మల తదితరులు భక్తిగీతాలు ఆలపించారు.

క్లుప్తంగా

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



నగదు అందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డి

గుంతకల్లు రూరల్: ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఆయన కుమార్తె మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డి పులగుట్టపల్లి పెద్దతండా గ్రామానికి చెందిన అప్పనాయక్‌కు రూ.10 వేలు ఆర్థిక సాయన్ని అందజేశారు. అప్పనాయక్ కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఇటీవల గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే గుటూరుకు చెందిన ఒక డాక్టర్‌తో మాట్లాడి అప్పనాయక్‌కు వైద్యం అందించేలా మాట్లాడారు. ఈక్రమంలో అప్పనాయక్ గుంటూరు వెళ్లేందుకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు నగదు అందజేశారు.

పామిడి: పట్టణంలోని 9వవార్డుకు చెందిన బెస్త రామాంజనేయులు కుటుంబానికి బుధవారం ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు నాయకులు ఆర్థికసాయం చేశారు. ఇటీవల బెస్త రామాంజనేయులు ప్రమాదవశాత్తు ఎద్దులపల్లిలోని జడ్పీహైస్కూల్ వద్ద కాలువపడి మృతి చెందిన విషయం తెలిసిందే. గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి రూ.10 వేల నగదును రామాంజనేయులు కుటుంబసభ్యులకు అందించారు.

భక్తిశ్రద్ధలతో శాంతి పూజ



కలశ పూజ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో బుధవారం మహా మృత్యుంజయ యాగంలో భాగంగా శాంతి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వాసు దేవ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, అర్చనలు, అభిషేకాలు, మంటపారాధన, రుద్రాభిషేకం, కలశ స్థాపన వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్‌బాబు, వాసవీ మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

గుత్తి: విద్యార్థులు ఇష్టంతో చదివి పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధించవచ్చని జేవీవీ వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి అన్నారు. గుత్తి ఆర్‌ఎస్‌లోని రెహనా పాఠశాలలో పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి? అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ సిటిజన్ శంకర రావు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో బ్రహ్మారెడ్డి మాట్లాడారు. పరీక్షలంటే ఇష్టం ఏర్పరుచుకోవాలన్నారు. ఇష్టంతో క్రమశిక్షణతో చదివితే ఉత్తమ మార్కులతో పాటు ర్యాంకులు కూడా సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, మన్సూర్ బాషా, రామ లక్ష్మయ్య, కరస్పాండెంట్ ముంతాజ్ బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: కల్లూరులో బుధవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబ సభ్యులు గమనించి 108లో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు బెంగళూరుకు రెఫర్ చేశారు. ఆత్మహత్య యత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

గ్రామాల్లో ‘సంకల్పయాత్ర’



అప్పేచర్లలో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

పెద్దవడుగూరు : మండలంలోని అప్పేచెర్ల, ఏ తిమ్మాపురం గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఈఓపీఆర్‌డి నాగేశ్వరశాస్త్రి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ మల్లీశ్వరి, ఏపీఓ పుల్లారెడ్డి, ఏపీఎం ఈశ్వరయ్య, క్రిష్టిపాడు డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి: పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ప్రియాంక అనే మహిళ కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది బుధవారం ఆత్మహత్యకు యత్నించింది. వివరాలు.. ప్రియాంక ఇంటిలో ఎవరూ లేని సమయంలో విషద్రావకం తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు.

ఘనంగా అయ్యప్ప స్వామి మండల పూజ



అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని హరి హర పుత్ర అయ్యప్ప ఆలయంలో బుధవారం అయ్యప్ప మండల, పడి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పడి పూజ అనంతరం అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. తదనంతరం అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. అయ్యప్ప నామ స్మరణతో అయ్యప్ప దేవాలయం మార్మోగింది.

వెంకటలక్ష్మీబాయికి సన్మానం



వెంకటలక్ష్మీబాయిని సన్మానిస్తున్న దృశ్యం

శింగనమల: స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థి, ఎస్‌ఐగా ఎంపికైన వెంకటలక్ష్మీబాయిని తహసీల్దార్ ఈశ్వరమ్మ సన్మానించారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్‌ఐ వెంకటలక్ష్మీబాయిని అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుదర్శన్, ఎంఈఓ–2 శివప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నగేష్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో సత్తా చాటండి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు బుధవారం సదస్సు నిర్వహించారు. ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్ హాజరై మాట్లాడారు. ప్రతి అభ్యర్థి పోటీ పరీక్షల్లో తమ ప్రతిభను మెరుగుపరచుకోవడానికి సదస్సు దోహదం చేస్తుందన్నారు. ఎస్కేయూ నుంచే సింహభాగం పోటీ పరీక్షల్లో గణనీయంగా ఎంపిక అవుతుంటారనే నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణను అందుబాటులోకి తెస్తామన్నారు. బుధవారం తొలి రోజు మాజీ పీఆర్వో డాక్టర్ బాలకృష్ణ స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు తీసుకున్నారు. గతంలోనూ ఉచితంగా వర్సిటీ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించారు.

వేతనాలు పెంచాలి

గుంతకల్లుటౌన్: అంగన్‌వాడీ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలివ్వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు నాగభూషణం కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు, అధ్యక్షుడు రమేష్, నాయకులు దాసరిశ్రీనివాసులు, మారుతి, అంగన్‌వాడీ నాయకురాళ్లు రేష్మా, గంగమ్మ, మున్సిపల్ యూనియన్ నాయకులు నరసయ్య, నూరి పాల్గొన్నారు.